# చేతులు కాలాక...

రచన :
శ్రీ తుమ్మల దాదా రెడ్డి

పెళ్ళిళ్ళు ముమ్మరంగా జరిగిపోతున్నాయి. ఊరంతా సందడి. మండిపోతున్న ఎండలో మాడమాడి పోతున్నా కాళ్ళకు పొక్కులు వస్తున్నా పల్లకి బోయలు సంబరపడుతున్నారు, పెళ్ళికూడు దొరుకుతుందని. అవ్వ బువ్వ పెట్టకున్నా పందిరిసీడ ఉందికదా అని అడుక్కుతినేవారి ఆనందం. నాకు ఆనందం లేకున్నా మా యింటినిండా బంధువులు ఉండడంవలన ఫ్రీగా బాధపడే అవకాశం చిక్కలేదు, అందుకే నాకూడా అందరిలాగే వుంది.

"అరే రామా! మాట్లాడవేమిరా ఏమో ఆలోచిస్తున్నావ్? ఓహో! మరదలు పిల్లగూర్చేమో! రాకముందే ఇంత ఆలోచిస్తున్నావ్ ఇక మరదలు వచ్చాక మాతో మాటాడడానికి ఈమాత్రం తీరికకూడా చిక్కదేమోననిపిస్తుంది"

"అంతేనా అక్కయ్యా, నన్ను మీరు అర్థంచేసుకొంది. అలా ఎప్పుడూ జరగదు" అంటూ నా గదివైపు కదిలాను.

పెళ్ళి! ఊహ తెలిసిననాటినుండి ఊహించుకొన్న పెళ్ళి రేపు జరగబోయేదేనా? ఇన్నాళ్ళటి నా ఊహలరాణి నిన్న చూసొచ్చిన రాణిలాంటిదేనా?

"మ్యారేజెస్ ఆర్ మేడ్-ఇన్-హెవెన్" వివాహాలు విధి నిర్ణయాలు అన్నమాటలో నిజం ఉందా? ఎంత పరిశీలించినా సమాధానం లభించలేదు.

"రామూ! నీవు బ్యాండ్ కొరకు వెళ్ళిరా!" అని నాన్న ఇచ్చిన రూపాయలు జేబులో తురుముకొని వంటింట్లోకి వెళ్ళాను.

"అమ్మా భోజనం చెయ్యాలి" ఆకలిలేకున్నా అడిగాను.

"ఎందుకురా బాబూ ఇంత తొందర"

బ్యాండ్ కొరకు ఊరెళ్తున్నా అని చెప్పి భోజనంచేసి బ్యాగ్ పట్టుకొని బస్ స్టాండ్ చేరాను. బస్ ఇంకా రావడంలేదన్న గాబరా పెరిగింది. నిరీక్షణ, నిట్టూర్పులతో వేగలేక నిల్చున్నా, మనకున్నది పేరు ఊరు లేని ఊహాల్లో, రూపంలేని ఊహాల్లో తాపం తీరని తపనలు ఎన్నెన్నో వొంగిచూసి తొలగిపోతున్నాయి.

పదిమంది పిల్లల తల్లి ఇద్దర్ని చంకలో వేసుకొని ఈడ్చుకొంటూ నడుస్తున్నట్లు ఫుట్ బోర్డుపై నిల్చున్న జనంతో వస్తుంది బస్సు.. బస్ కొరకు చూస్తున్న జనంలో కిటకిటలు మొదలయ్యాయి.

తుపాకి చేతోపట్టుకొని యిద్ధానికివెళ్ళే సైనికునిలా నేను బ్యాగ్ పట్టుకొని బస్ వద్ద చేరాను. ఎక్కి కూర్చోవడానికి ఐదునిమిషాల సమరం జరపాల్సివచ్చింది.

"బాబూ! పెద్దమనిషిని నిల్చోలేనివాన్ని కాస్త చోటిస్తావా" అని ఓమాలిన ముసలాయన్ని కాదని పైంటతనికి సీటిచ్చాను, తర్వాత అనిపించింది పాపం! ముసలాయినకి సీటిస్తే బాగుండేదని.

టికెట్ ప్లీస్ అంటూ చేరాడు కండక్టర్, వాడి ముఖంచూస్తే తెల్లవాడు గుర్తొచ్చేస్తాడు. అందరినీ బెదిరిస్తున్నాడు చిల్లర యిమ్మని, పాపం, అతడేం చేస్తాడు టికెట్ ఇస్తే వెనుక వ్రాసియిచ్చేవాడు కాని టికెట్ యివ్వడమే లేదాయె.

"టికెట్ తీసుకొన్నారా సార్" వినయంగా నన్నడిగాడు. సమాధానంగా నేనైదు రూపాయలిచ్చాను. చిల్లర తిరిగియిచ్చాడు. అవి లెక్కిస్తే అర్థరూపాయి ఎక్కువేవుంది. టికెట్ ఇవ్వలేదు. నాకు ఎక్కువ ఇచ్చిన అర్థరూపాయి కమీషన్ అని అర్థమయ్యింది. టికెట్ అడగాలనిపించింది. నీవు టికెట్ అడిగితే నలుగురిలో చులకనపాలవుతావ్ వీడెవడో సభ్యత తెలియని ఊరోడు అనుకొంటారు అని అంతరాత్మ హెచ్చరించింది.

అందుకే బస్సునువదలి బయటి వాతావరణంలోకి చూశాను. చెట్లూ, చేమలూ, గట్లూ, గుట్టలూ అన్నీ దాటేస్తుంది మా బస్సు, ఎన్నో యోచనల్ని కదుపుతోంది నా మనస్సు, దృష్టి ప్రకృతిలోకిపోయింది. కనులు నిలిచిపోయాయి చితిమంటల్ని చూడగానే, దృష్టికి అందకుండా అయ్యాయి ఆ చితిమంటలు.

అబ్బబ్బ, ఏం మనుష్యులు! ఈ మృత్యువు అనేదే లేకుంటే ఇంకెలాగుండేదో? డబ్బంటే ఎందుకింత




ఎల్లప్పుడూ...

ఒలింపిక్
బ్లూ బర్డ్ బనియన్లనే
ఉపయోగించండి.

: తయారించువారు :

ఒలింపిక్ నిట్టింగ్ కంపెని, తిరుపూరు-638604.

వ్యామోహం? దీనికోసమే మనిషిని మనిషి వంచించడమా? స్వార్థపరత్వం, సంకుచితత్వం స్వారాజ్యమేలుతున్న ఈ సమాజంలో నీతి నిజాయితీల నీడైనా కానరావడం లేదు ఎందుకు? సాటి మనుష్యుల పట్ల సానుభూతి చూపించని సమాజంలో మార్పు వచ్చేది ఎలా? ప్రతి మనిషిలో పరివర్తన రావాలి లేకుంటే మనిషి మనుగడ గండంగా పరిణమిస్తుంది. అంతా చేరేది ఒకే గమ్యం, అందరికీ కావల్సింది ఆదే ఆరడుగుల నేల. అది చేరేదాకా తలోదారిన పయనించాల్సిందేనా? అంతా ఒకే తీరున, ఒకే దారిన, సామరస్యంగా సాగితే ఎంత బాగుండేనో! బస్సు ఆగిపోయింది.

అంతా గబగబా దిగుతున్నారు నేను దిగే స్టేజీ వస్తుందని బ్యాగ్ చేత్తోపట్టుకొని కూర్చున్నా నా దృష్టి కండక్టరు వైపుమళ్ళింది. నోట్లను జేబులో కుక్కుకుంటున్నాడు. నోట్లో విల్స్ సిగరెట్ పొగలు కక్కుతోంది. అతను ఇంతకుముందు ముసలాయనతో అన్న మాటలు గుర్తొచ్చింది.

"ఏమయ్యా నీకు కనులు లేవా అటు చూడు పొగ త్రాగరాదు అని విడివిడిగా వ్రాసి ఉంది" అని గాండ్రించాడు, పాపం ఆ ముసలాయన కోరికను అణచుకొని అవమానంతో ఆ చుట్టను ఆర్పేశాడు. పొగ త్రాగేందుకు కండక్టరుకు పర్మిశన్ ఉందా? అని నాలో ప్రశ్న ఉద్భవించినా "నీకెందుకు త్రాగుతున్నావ్?" అని కండక్టరును నిలదీసి అడగలేకపోయాను ఎందుకో కాదు వాడు చేస్తున్న మర్యాదకు బానిసనైపోయాను. ఛీ! ఛీ! నాకు నచ్చని పనుల నేనే చేస్తున్నా. ఏమిటి దీనికి కారణం? అని తర్కించుకుంటే సమాధానం శూన్యం. నేను దిగే ఊరు రానేవచ్చింది. బస్సు ఆగడం నేను దిగడం ఒకేసారి జరిగింది.

బ్యాండ్ కొరకు బయలుదేరాను, వాణీ బ్యాండ్ తాటికాయలంత అక్షరాలున్న బోర్డు కొట్టవచ్చినట్లు అగుపడింది. ఒక్కసారే నా మదిలో పిడుగులా దూరింది వాణి. వాణిని ఎంత మరచిపోదామన్నా కుదురలేదు, వాణి ఎవరో కాదు స్వయాన నా మేనమామ కూతురే! వాణినిగూర్చి చిన్ననాటినుండీ ఏవేవో కలలు కన్నాను. వాణిని పెళ్ళి చేసుకోవాలన్న ఆశ అంతరాంతరాల్లో అలజడిని రేపేది వాణి. చాలా అమాయకురాలు నేనేది చెప్పినా అలనా బావా అంటూ కుందేలులా చెవులు రిక్కించి కనులు త్రిప్పుతూ వినేది. ఆ కనులలో కానరాని అందం నా కెక్కడా కానరాలేదు అని నేను లెక్కలేనన్ని మార్లనుకొన్నాను. ఇప్పుడెన్ని అనుకుంటే ఏం లాభం? నా వాణి నాక్కాకుండా పోయింది ఇపుడు వాణినిగురించి యోచించడమే తప్పు. అయినా నేను యోచించడం మానలేకపోయాను, వాణిని నాక్కాకుండాచేసిన నాన్న పట్ల కసిపుడుతోంది వాళ్ళేం యిస్తారా? మహా ఇస్తేగిస్తే పదివేలు. వేరెవరన్నా అయితే కనులు మూసుకొని ముప్పైవేలిస్తారు అని నా దారికి అడ్డుతగిలాడు. డబ్బునెవరడిగారు అని నేనన్నమాటను చంపేశారు నా అనేవారంతా కలిసి. అంతా ఏకమై వాణికి మరొకనితో పెళ్ళి జరిపిం

చారు నేను తిరగబడినా బాగుండేదని ఇప్పుడనిపిస్తుంది ఏం లాభం!

అన్నీ జరిగిన తర్వాతే తెలుస్తున్నాయి నా జీవితమంతా యింతేనా? ఏదీ సవ్యంగా జరగదా? ఆలోచనల్లోపడి బ్యాండ్ మాటే మరచాను.

నాలుగడుగులు నడిచి బ్యాండ్ వాళ్ళను పిలిచి అడ్వాన్స్‌గా ఏబది రూపాయలిచ్చాను. వచ్చినపని అవడంవల్ల తిరుగుముఖం పట్టేసరికి హోటల్ శాంతి అడ్డొచ్చింది. శాంతికి తావులేకున్నా పేరైతే శాంతి, మసాలా దోసె తినేసరికి వరపూజనాటి గడియారం బస్ టైమైనట్లు తెలిపింది.

సరియైన సమయానికి బస్ రావడం సీటు దొరకడం ప్రయాసలేకుండా అయ్యింది. వాణి నేవెళ్ళేసరికి వచ్చి ఉంటుందో లేదో నూరు విధాలా ఇవ్వాళ్ళే రావాలి, తప్పకుండా వస్తుంది. నేను వెళ్ళేసరికి చంకలో బాబునేసుకుని నిరీక్షిస్తుంటుందో లేక వంటింటిలో పనిలో నిమగ్నమైపోతుందో ఏమో చూడాలి!

బస్సు భారంగా నిండుచూలాలిలా కదిలింది. గంటసేపటిలో నన్ను మా ఊరులో వదిలింది. గబగబా నడిచాను ఇంటివైపు. నాలో అర్థంపర్థంలేని ఆలోచనలు, ఎందుకో కొత్త ఉత్తేజం పొడసూపుతుంది.

నేను ఊహించినట్లే చంకలో బిడ్డనెత్తుకొని ఎదురైంది వాణి. నా కనులు నాలుగైనాయి కాళ్ళు తడబడసాగాయి.

"నమస్తే బావా" నవ్వుముఖంతో వాణి స్వాగతం పల్కింది.

"క్షేమమేనా" తడబడే స్వరంతో అడిగాను.

"ఆ క్షేమమే! ఏదో ఇలాగున్నాము" విషాదం మిళితమైన కంఠంతో జవాబిచ్చింది వాణి.

ఆరే రామూ! బ్యాండ్ మాట్లాడావా? అన్న నాన్నగారికి జవాబుచెప్పి సరాసరి నాగదిలో దూరాను.

గతంలో హృదయానికైన గాయం, కెలికినట్లయింది. బరువైన మనసుతో బాధల్లో బందీగా మిగిలాను. తీరని కష్టాలను హారంగా ధరించక తప్పదా అని తీక్షంగా ప్రశ్నించుకుంటే తప్పదు! తప్పదు! చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం శూన్యం! ఇదే సమాధానం.

★

సీతారామాంజనేయ మూవీస్ వారి

"మనస్సాక్షి"లో

కృష్ణ — భారతి.

★

